క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల సందర్శన



కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మ డవల్లి, వడ్డెర రంగాపురం, నారాయణపురం గ్రామాలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్ వంటి సౌకర్యాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సోయం ప్రసాద్‌రావు, ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు, కార్యదర్శులు బాబు, రాంబాబు పాల్గొన్నారు.

హుండీ నగదు లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు సోమవారం లెక్కించారు. దేవదాయ శాఖ కొత్తగూడెం జిల్లా పరిశీలకులు పీ బెయిల్ సింగ్ పర్యవేక్షణలో అమ్మవారి ఆలయంలోగల హుండీలను తెరిచి లెక్కించగా ఈ ఏడాది జూన్ 6వ తేదీ నుంచి ఈ నెల 23వ తేదీ వరకు రూ.78,958రూపాయాల ఆదాయం వచ్చింది. ఆలయ ఈవో సూర్య ప్రకాష్, శ్రీను, నల్లపు నరసింహారావు, జగదీష్, అర్చకులు ప్రసాద్, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ



రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న సీఐ

అశ్వాపురం: అశ్వాపురం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అశ్వాపురం జెడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థి కొర్లకుంట కిషోర్ అందజేసిన రెయిన్ కోట్లను సోమవారం పంచాయతీ కార్యాలయంలో సీఐ అశోక్‌రెడ్డి కార్మికులకు అందజేశారు. ఎంపీడీఓ గంటా వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, ఏపీఓ సీతరాములు, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, వేములపల్లి రమేష్, వేములపల్లి కృష్ణార్జున్‌రావు, కేకే ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లెబోయిన నాగేశ్వరరావు, షేక్ నయీం, నాగుల్‌పాషా పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు

అశ్వాపురం: మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, ఈ హింసాఖాండను ఖండించాలని చైతన్య మహిళా సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి కొప్పుల గీత అన్నారు. మండల పరిధిలోని రామచంద్రాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నేడు(మంగళవారం) హైదరాబాద్‌లో జరిగే చైతన్య మహిళా సంఘం 29వ ఆవిర్భావ సదస్సును మహిళలు జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌కే.రహిమాభేగం, కంది పూలమ్మ, సోమ వాణి, కళ్లెం భద్రమ్మ, సుభద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

మణుగూరు రూరల్: కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన అమలుకు ఈ నెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్లకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి.రాసుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మికులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గోపి, రాజు, సాంబయ్య, రాములు, శంకర్, శేఖర్, అన్నపూర్ణ, డాలి, సత్యవతి, ఎల్లమ్మ, రమాదేవి, నాగమణి, నందిని, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

కరకగూడెం: ప్రభుత్వ భూములు, డ్రెయినేజీల స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగప్రసాద్ హెచ్చరించారు. కరకగూడెం ప్రధాన సెంటర్ వద్ద డ్రెయినేజీల వెంట సోమవారం డోజర్ ట్రాక్టర్‌తో చదును చేయించి పార్కింగ్‌కు ఏర్పాట్లుచేశారు. ఆ తర్వాత ప్రభుత్వ భూమిలో పిచ్చిమొక్కలు తీయిస్తుండగా ఓ వ్యక్తి వచ్చి ఆ భూమి తనదేనని, కోర్టు ఆర్డర్ కూడా ఉందని అడ్డుకున్నాడు. దీంతో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అని తెలిసి, పంట లేకున్నా తాము నాశనం చేశారని పేర్కొనడం సరికాదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఏడు దాటితే బస్సు బందే!

ఏజెన్సీ వాసులకు తప్పని బస్సుల తిప్పలు..

- మామూలుగా రాత్రి 7 గంటలకు.. మావోయిస్టుల వారోత్సవాల్లో మధ్యాహ్నం 3 గంటలకే బస్సుల నిలిపివేత
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అధికారుల తీరును తప్పపడుతున్న ప్రజానీకం



వెంకటాపురం వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో చర్ల బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

చర్ల: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారయ్యింది ఏజెన్సీ వాసుల పరిస్థితి. ఏజెన్సీలోని దాదాపు అన్ని మండలాలకు రహదారి సౌకర్యం ఉన్నా, ప్రయాణికులు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులు నడిపేందుకు సిద్ధమవ్వకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పు పడుతున్నారు. ఏళ్ల తరబడిగా ఏజెన్సీలోని దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలపై ఆర్టీసీ అధికారులు తీవ్ర వివక్షతను చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 7 గంటల తరువాత బస్సులు నడపకపోవడం, ఉదయం 7 గంటల తరువాతనే మళ్లీ నడుస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు మామూలు రోజుల్లో రాత్రి 7 గంటలు దాటితే బస్సులు ఉండవు. విద్యార్థులు, పొట్టకూటి కోసం భద్రాచలం, సారపాక ప్రాంతాలకు కూలీ పనులకు రోజు వెళ్లి వస్తున్న కూలీలు బస్సులు నిలిపివేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 7 తరువాత భద్రాచలంకు చేరుకునే ఏజెన్సీ ప్రయాణికులు వారి వారి గ్రామాలకు చేరుకోడానికి బస్సులు ఉండకపోవడంతో అతికష్టం మీద అదనపు చార్జీలను చెల్లించి ఆటోలు, ప్రయివేటు వాహనాల ద్వారా చేరుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇదే అదునుగా భావించి వాహనదారులు అందిన కాడికల్లా దండుకుంటున్నారు.

నైట్ హాల్ట్ ఏర్పాటుచేయాలని..

భద్రాచలం నుంచి చర్లకు, వెంకటాపురం నుంచి చర్లకు షెటిల్ సర్వీసులను తిప్పడానికి గానీ చర్లలో నైట్‌హాల్ట్ బస్సులను ఉంచడానికి గానీ ప్రయత్నిస్తే కాస్తా కష్టాలు తీరుతాయని పలువురు కోరుతున్నారు. భద్రాచలం నుంచి చర్ల వరకు బస్సులను నడిపేందుకు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆ దిశగా ఆర్టీసీ అధికారులు పరిశీలన చేయకపోవడంతో జనం అధికారుల తీరును తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

ఇప్పుడు మధ్యాహ్నమే..

ఇటీవల కాలంలో సరిహద్దుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు చర్యలకు పోలీసుల ఆదేశాలంటూ ఆర్టీసీ అధికారులు మధ్యాహ్నం 3 గంటల నుంచే ఏజెన్సీకి బస్సులను పూర్తిగా నిలిపివేస్తున్నారు. తాజాగా మావోయిస్టు పార్టీ ఆవిర్భావ ఉత్సవాలను సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20 వరకు నిర్వహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మూడు రోజుల నుంచి మధ్యాహ్నం 3 గంటల నుంచే దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు బస్సులు నిలిపివేస్తున్నారు. భద్రాచలం నుంచి 3 గంటలకు బయలుదేరే బస్సు వెంకటాపురానికి వెళ్లే సరికి రాత్రి 7 గంటలు అవుతోందని రాత్రి అవుతుండడంతోనే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము బస్సులను నిలిపివేస్తున్నామని చెబుతుండగా నెల రోజుల పాటు కష్టాలు తప్పవని ప్రజలు వాపోతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఏజెన్సీ గ్రామాలకు బస్సులు నడిపే విషయంలో ఆర్టీసీ అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం ప్రాంతాలకు వెళ్లాలంటే రాత్రి ప్రయాణం నరకంలా ఉంటోంది. రాత్రి 7 గంటలు దాటితే బస్సులు ఉండవు. రాత్రి పూట కూడా కనీసం 10 గంటల వరకు అయినా బస్సులు నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.విజయ్, ఆర్ కొత్తగూడెం

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం



రాత్రి పూట బస్సులు నడవకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటోంది. వాహనదారులు చర్లకు రూ100, వెంకటాపురానికి రూ.250 వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మీ ఇష్టం అలాగేతే ఎక్కండి లేకుంటే లేదంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్భాల్లో బస్సులు, సరిపడా డబ్బులు లేక రాత్రంతా బస్టాండ్‌లోనే ఉండాల్సి వస్తోంది.

– సీహెచ్ వీరయ్య, కాశీనగరం

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



గొయ్యి పడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేగా

దుమ్ముగూడెం : మండలంలోని అచ్చితాపురం గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో గొయ్యి పడిన కల్వర్టు నిర్మాణంతో పాటు రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హామీ ఇచ్చారు. సోమవారం మండల పర్యటనలో భాగంగా అచ్చితాపురం గ్రామానికి వెళ్లిన ఆయనకు రహదారి సమస్య విషయాన్ని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకు రాగా దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో పలువురి మృతదేహాలు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానీపాషా, దామెర్ల శ్రీనివాస్, మోతుకూరి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మీ, నాయకులు తునికి కామేశ్వరరావు, జానీ పాషా, కొండపల్లి నరేంద్ర, సుబ్బారావు, సోయం, నర్సింహారావు, జెట్టి రామకృష్ణ, లంక శివ, భూపతి రావు, శ్రీను ల్గొన్నారు.

ఎస్సైకు సన్మానం

ములకలపల్లి: రోడ్డు ప్రమాద బాధితులకు రూ.30 వేలు ఆర్థికసాయం అందించిన ఎస్సై కిన్నెర రాజశేఖర్‌ను మున్నూరుకాపు సంఘం మండలకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో సోమవారం శాలువా కప్పి సత్కరించారు. సంఘ మండలాధ్యక్షుడు మేకల పెద్ద వెంకన్న, ప్రధాన కార్యదర్శి పుష్పాల చందర్‌రావు, బేతాళ వెంకన్నబాబు, నాగేశ్వరరావు, శనగపాటి అంజి, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

ఆక్రమణ దారులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దమ్మపేట: ఆదివాసీల కమ్యూనిటీ హాల్ కోసం ఉంచిన స్థలాన్ని ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం తహసీల్దార్ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్సై సాయి కిషోర్ రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. కొరసా వెంకటేష్, బండారు సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, తంబళ్ల రవి, కారం శ్రీరాములు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై రాజేందర్, సిబ్బంది

కరకగూడెం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో కరకగూడెం ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రతీ వాహనదారుడిని క్షుణ్ణంగా పరిశీలించి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. నిబంధనల మేరకు వాహన చోదకులు ప్రయాణాలు కొనసాగించాలని విధిగా హెల్మెట్ ధరించి ధ్రువపత్రాలన్నీ ఉండాలని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అమరలపూడి రాము డిమాండ్ చేసారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు.హామీలు అమలు చేయని పక్షంలో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. గోకినపల్లి ప్రభాకర్, ముత్యాలరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న రేవతి

దుమ్ముగూడెం: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టాలని 141 ఈ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్ పిలుపునిచ్చారు. సోమవారం 141 ఈ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో లక్ష్మీనగరం గ్రామంలోని మడోన్నా, కిడ్స్ పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఎస్సై దేవన్న, ఏఎస్సై భాస్కరరావు, జవాన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తెల్లంకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు గుంజ బాబు, ఏడుకొండలు, వల్లెపు శ్రీను, పిట్టల శివ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

దుమ్ముగూడెం: మండల పరిధిలో గల అచ్చితాపురం, చిన్న బండిరేవు, చిన్న నల్లబెల్లి గ్రామాల్లో పలువురు మృతిచెందగా వారి మృతదేహాలను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం చిన్న బండిరేవు పీహెచ్‌సీని సందర్శించి, రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, సకాలంలో వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు లంక అబ్బులు, మాజీ సర్పంచ్ మట్టా శివాజీ, పిలకా. వెంకటరమణారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



విద్యార్థుల మానవహారం

మణుగూరు రూరల్ : పట్టణంలోని కాశీమాత ఏరియాలో ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞతో మానవహారంగా ఏర్పాటు చేసి వీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు ఓసీలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అధికారులతో సుమారు 500 మొక్కలు నాటారు. అధికారులు శ్యాంసుందర్, సలగల రమేశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి ఉన్నారు.

జమిలీ ఎన్నికలు సరికాదు

చర్ల: బీజేపీ ప్రతిపాదిస్తున్న జమిలీ ఎన్నికల విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని, దీనిని ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీసెంటర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మహాసభలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు, కారం నరేష్, సమ్మక్క, హరినాగవర్మ, వరలక్ష్మి, గోపాల్, షారూని, సూరమ్మ, ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రతీ మండలంలో క్రీడా స్టేడియం

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని, ప్రతి మండలంలో ఆధునిక హంగులతో క్రీడా స్టేడియం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జోనల్‌స్థాయి (బూర్గంపాడు, ముల్కలపల్లి,పాల్వంచ) క్రీడాపోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మండల, జోనల్, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహిస్తుందన్నారు.

ఆస్పత్రి భవనాలు త్వరలోనే ప్రారంభిస్తాం..

బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రి నూతన భవనాల నిర్మాణాలను తొందరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పాయం అన్నారు. ఈ మేరకు ఆస్పత్రిని ఆకస్మికంగా పరిశీలించిన ఆయన రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు.

మోతెగడ్డ ఆలయ పరిశీలన..

ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు గోదావరి నది మధ్యలోని పురాతన మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయ ప్రహరీ వద్ద మట్టి కోతకు గురైందని, ఆలయానికి ముప్పు పొంచి వుందని ప్రచారమాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం సాగగా ఎమ్మెల్యే ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ప్రహరీ వద్ద మట్టి కోతకు గురైందని, ఆలయానికి ఎలాంటి ముప్పు లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, జోనల్ క్రీడల ఇన్‌చార్జ్ రవిలా, ఎస్సై నాగభిక్షం, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, చెన్నం సూర్యప్రసాద్, మారం వెంకటేశ్వరరెడ్డి, జక్కం బలరామ్, నాగరాజు, భజన సతీష్, భజన ప్రసాద్, బర్ల నాగమణి, చిప్పారాజు, ఆలయ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఎండోమెంట్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారె విస్తృత పర్యటన



అన్నపురెడ్డిపల్లి: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారె

అన్నపురెడ్డిపల్లి: మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని అన్నపురెడ్డిపల్లి, రాజాపురం, అబ్బుగూడెం, పెంట్లం, జానకీపురం, భీమునిగూడెం , పెద్దిరెడ్డిగూడెంలోని లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి షాదీముభారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలను సందర్శించి, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి, విద్యార్థినిలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, నాయకులు వేముల రమణ, పర్సా వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, రాము, శివ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే ఆదినారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా రాచూరుపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు పరిశీలించారు. పలువురు మృతిచెందగా వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. బాధిత కటుంబాలను పరామర్శించారు. నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

దుమ్ముగూడెం : మండలంలోని ఆర్లగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల క్రీడామైదానంలో పాఠశాలల స్థాయి జోనల్ క్రీడలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సున్నం సమయ్య ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ సోమశేఖర్, సెక్రటరీ దశమిబాబు, పీడీలు నాగేశ్వరరావు, రమణ, వసంత్, వెంకట్, నారాయణ, కేజియ, వెంకటేశ్వర్లు, సుజాత, పార్వతి, శ్రీను, జానకి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ కోసం ఇరువర్గాల వాగ్వాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఎస్సై స్వప్న

చంద్రుగొండ : మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రధాన సెంటర్ నుంచి ముత్యాలమ్మ దేవాలయం వరకు నిర్మించనున్న డ్రెయినేజీల నిర్మాణం రోజుకో మలుపు తిరుగుతుంది. ఈ క్రమంలో డ్రెయినేజీలు కావాలని ఓ వర్గం, వద్దు పరిహారం ఇచ్చిన తరువాతే అంటు మరో వర్గం మధ్య సోమవారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్సై గంజి స్వప్న సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఆర్అండ్‌బీ ఏఈ లఖన్ నాయక్‌తో ఆమె చర్చించారు. నిబంధనల ప్రకారం నిర్మాణ పనులు చేపట్టాలని సూచించడంతో పనులు ప్రారంభించారు. ఇదిలా ఉండగా మరో పది మంది బాధితులు హైకోర్టును ఆశ్రయించినట్లు ప్రచారం నడుస్తుంది.

ప్రభుత్వాస్పత్రిలో సిబ్బందిని కేటాయించాలి



మాట్లాడుతున్న రాంబాబు

ములకలపల్లి: మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీలో సిబ్బందిని కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 40 వేల జనాభా కలిగిన ములకలపల్లి మండలంలో ఏకైక ప్రభుత్వాస్పత్రిలో పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు వైద్యం అందడంలేదని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఊకంటి రవికుమార్, గొగ్గెల ఆదినారాయణ, సీహెచ్, వినోద్, వెంకన్న తదితరులు ఉన్నారు.

'చీడ పార' నివారణకు టీకాలు

కరకగూడెం: మేకల్లో, గొర్రెల్లో చీడ పార వ్యాధి నివారణకు సోమవారం కరకగూడెం పశు వైద్యశాల సబ్ ఆర్డినేటర్ షేక్ సోందుమీయా మండల పరిధిలోని రఘునాథపాలెం, అనంతారం, పద్మాపురం గ్రామాల్లోని పలువురు రైతులకు చెందిన సుమారు 1,500 మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల రొట్టను తినడం వలన జీవాల్లో ఈ వ్యాధి వస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న లేబర్‌కోడ్లు



బూర్గంపాడు: లేబర్‌కోడ్ ప్రతులను దహనం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు



ములకలపల్లిలో..

బూర్గంపాడు: కార్మికుల హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సోమవారం ఐటీసీ పీఎస్‌పీడీ మెయిన్‌గేట్ వద్ద కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, ఐడల్ యూనియన్ కార్యదర్శి సాబీర్‌పాషా, యాకుబ్‌పాషా, బత్తుల వెంకటేశ్వర్లు, మల్లికంటి వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, కొండారెడ్డి, పోటు నర్సింహారావు, సాయిబాబు, దయాకర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. రామడుగు వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, పెద్దిని వేణు, సీతారాములు, బాలాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చర్ల: కార్మికుల వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చర్లలో లేబర్‌కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. నాయకులు ఇస్సాక్, పాల్, కాంతారావు, వెంకటేశ్వర్లు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని వామపక్ష పార్టీల అనుబంధ సంఘాల నాయకులు స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు యూసఫ్, సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, కొర్సా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.